పాతమల్లంపేటలో స్వస్త్ నారి స్వశక్త్ పరివార్

విశాలాంధ్ర - గొలుగొండ : మహిళలు శక్తివంతంగా ఆరోగ్యవంతంగా ఉంటేనే ఆ కుటుంబం పటిష్టంగా ఉంటుందని దీనికై మహిళలు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సర్పంచ్ గెద్దం ఆదిలక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం పాతమల్లంపేట లో స్వస్త్ నారి శసక్త్ పరివార్ లో భాగంగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో నిర్వహిస్తున్న ఈ మెడికల్ క్యాంపులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు. అలాగే ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే ఎటువంటి వ్యాధులు దరి చేరమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి శ్రీ గౌరీ వైద్య సిబ్బంది అంగనవాడి సిబ్బంది గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు అంతా అనుకూలమే....

- రైతులకు ఆర్ఆర్ ఫ్యాకెజీ ప్రకటించాలి - స్థానిక యువతకు ఉద్యోగ అవకాశలు ఇవ్వాలి
- భూములు కోల్పోయిన రైతులకు, నిర్వాసితులకు కంపెనీలో ఉపాధి కల్పించాలి
- పర్యావరణ పరిరక్షించాలి - మత్స్యకారుల భద్రత కల్పించాలి

విశాలాంధ్ర, నక్కపల్లి/పాయకరావుపేట : మండలంలో పాటిమీద గ్రామంలో కాలుష్య నియంత్రణ ఆద్వర్యంలో శనివారం జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పర్యవేక్షణలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ మేరకు బుచ్చిరాజుపేట, చందనాడ, డిఎల్‌పురం, రాజయ్యపేట & వేంపాడు గ్రామాల్లో 2200 ఎకరాల్లో 8.2 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేడ్ స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా అర్సెలర్ మిట్టల్ నిప్పాల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొని అందరు స్టీల్ ప్లాంట్‌కు అనుకూలంగానే ప్రస్తావించారు. ఈ ప్రాంతంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయడం వల్ల నక్కపల్లి మండలంతో పాటు నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని, స్థానికంగా ఉద్యోగాలు వస్తాయని, స్టీల్ ప్లాంట్ ఏర్పాటు మేము వ్యతిరేకంకాదన్నారు. ఈ ప్రజాసేకరణలో జిల్లా కలెక్టరు విజయ్ కృష్ణన్ మాట్లాడుతూ అర్సెలర్ మిట్టల్ నిప్పాల్ స్టీల్ ప్లాంట్ సంబందించి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం జరిగిందని, రైతులకు సంబందించి సమస్యలు తెలుసుకొని నివేదికను తయారు చేసి ప్రభుత్వం దృష్టి తీసుకువెళ్లడం జరుగుతుందని, ప్రధానంగా కంపెనీలో స్థానికులకు అర్హులైన వారికి, స్కిల్ డవలప్‌మెంటు ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకొంటామని, పర్యావరణ కాలుష్యం భద్రత వంటి అంశాలపై కంపెనీ యాజమాన్యం దృష్టి పెట్టాలని, గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రాంతంలో ఇటువంటి కంపెనీ రావడం మనందరి అదృష్టంగా భావించాలన్నారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌లో స్థానికులకు 75 శాతం ఉపాధి అవకాశాలు కల్పించాలని, 168 కోట్లు పర్యావరణ పరిక్షణకు నిధులు పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. 25 వేల మంది ఉపాధి అవశాలు కల్పిస్తామని చెప్పి, ప్రారంభ దశలో ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి పనులు చేస్తున్నారని తెలిపారు. స్టీల్ ప్లాంట్‌లో ఉద్యగ అవకాశాలు పొందేందుకు స్కిల్ డెవలప్‌మెంటు సెంటర్లు ఏర్పాటు చేసి, యువతకు నైపుణ్యతపై శిక్షణ ఇవ్వాలని, స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేసారు. రైతులకు ఆర్ఆర్ ఫ్యాకేజి ఇవ్వాలని, ఆర్ కార్డు ఇవ్వాలని, పునరాసం కల్పించిన ప్రదేశంలో మెరుగైన సదుపాయాలు కల్పించి, కంపెనీ ఉత్పత్తి ప్రక్రియలో వెలువడే ధూళి, విష వాయువులు, ఉష్ణ వాయువుల, ఇతర వాయువులు నిర్వహణ, నిల్వలలో పటిష్టమైన భద్రతా ప్రమాణాలు కంపెనీ యాజమాన్యం తీసుకోవాలన్నారు. భద్రత, పర్యావరణ ప్రమాణాలు పర్యవేక్షణకు ప్లాంటు యాజమాన్యం ప్రత్యేక చర్యలు డిమాండ్ చేసారు.

స్థానికులకే ఉద్యోగ అవకాశలు కల్పించాలి

అర్సెలర్ మిట్టల్ నిప్పాల్ స్టీల్ ప్లాంట్ ఈ ప్రాంతంలో రావడంతో ఎంతో అభివృద్ధి చెందుతుందని, భూములు కోల్పోయిన రైతులకు ప్రత్యేక ప్యాకేజిలు కల్పించాలని, యువతకు ఉద్యోగ అవకాశలు కల్పించే విధంగా అధికారుల కృషి చేయాలన్నారు.

గింజాల లక్ష్మణరావు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు

రానున్న రోజులలో మరికొన్ని కంపెనీలు

ఈ ప్రాంతంలో ఇప్పటికే అర్సెలాల్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ వంటి కంపెనీ రావడంతో నక్కపల్లి మండలం మరింత అభివృద్ధి చెందుతుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి అనిత మరికొన్ని కంపెనీలు వచ్చే విధంగా కృషి చేస్తున్నారని తెలిపారు.

కొప్పిశెట్టి వెంకటేష్ తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కన్వీనర్

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలి



అర్సెలర్ మిట్టల్ నిప్పాల్ స్టీల్ ప్లాంట్ స్థాపించడం ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని, భూ కోల్పోయిన రైతులకు కంపెనీలో ఉపాధి కల్పించాలని, కంపెనీ యాజమాన్యం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలన్నారు.

కొప్పిశెట్టి బుజ్జి పిఎసిఎస్ చైర్మన్

25 వేల మంది ఉపాధి అవకాశాలు కల్పించాలి

25 వేల ఉపాధి అవకాశాలు కల్పించాలని చెప్పారు, ఈ ప్రాంతంలో ప్రభుత్వ ప్రైవేటు ఐటిఐ ఉన్నాయని, షార్ట్ టర్మ శిక్షణ ఇవ్వాలని, భూములు ఆధారపడి ఉన్న రైతులు, దళితులకు, వ్యవసాయ కూలీలకు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఈ కంపెనీ ఆవరణలో గ్రీన్‌బెల్ట్ పెంచాలన్నారు. జిరాయితీ భూములతో పాటు సమానంగా డిపట్టా భూములు నష్ట పరిహారం ఇవ్వాలన్నారు.

జెవి ప్రభాకర్ డిహెచ్‌పియస్ ఎపి రాష్ట్ర అధ్యక్షులు

నిర్వాసితులకు సరియైన ఫ్యాకేజి ఇవ్వాలి

నిర్వాసితులకు సరియైన ఫ్యాకేజి ఇవ్వాలని, స్కిల్ డవలప్‌మెంటు సెంటర్లు ఏర్పాట్లు చేయాలని, స్థానికలకు చట్ట ప్రకారం ఉపాధి కల్పించాలన్నారు.

కంబాల జోగులు మాజీ ఎమ్మెల్యే

కాలుష్య నియంత్రణ చేపట్టాలి

ఈ ప్రాంతంలో సహజ సిద్ధమైన వనరులకు, పచ్చదనానికి ప్రసిద్ధి, ఇక్కడ సముద్రపు జలాలలకు ఇతర నీటి వనరులకు, కొండ ప్రాంతాలకు నష్టం జరగకుండా కాలుష్య నివారణ తగిన చర్యలు తీసుకోవాలని, కర్మాగార నిర్మాణ సమయంలో ఈ ప్రాంత పచ్చదనానికి రక్షణ కల్పిస్తూ, జల, శబ్ద, వాయు కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని, ఇల్లు కోల్పోయిన వారి కుటుంబాల్లో విద్యార్హత బట్టి శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని, స్థానికులందరికి చట్ట ప్రకారం ఉద్యోగ ఉపాధి అశకాశాలు కల్పించి, భూములు కొల్పోయి నష్ట పరిహారం అందిచాలని, అర్హులై ఉండి మిగిలిన వారికి ఆర్ & ఆర్ ఫ్యాకేజి ఇవ్వాలని, ఈ ప్రాంత అభివృద్ధి విద్యా, వైద్య, తాగునీరు, గ్రామ మౌలిక సదుపాయాలు కంపెనీ యాజమాన్యం పూర్తి భాధ్యత తీసుకోవాలి. బల్క్ డ్రగ్స్ ఏర్పాటు చేయవద్దని తక్షణమే రద్దు చేయాలన్నారు.

వీసం రామకృష్ణ వైఎస్సార్ పార్టీ సీనియర్ నాయకులు

18 ఏళ్లు నుండి వారికి 25 లక్షల రూపాయిలు ఫ్యాకేజి ఇవ్వాలి

అర్సెలర్ మిట్టల్ నిప్పాల్ స్టీల్ ప్లాంట్‌కు ప్రభుత్వం 2200 ఎకరాల్లో భూమలకు కేటాయించడం జరిగిందని, కాని ఇప్పటికి భూములు కోల్పోయిన నిర్వాసిత్తుల పూర్తి స్థాయి నష్ట పరిహారం చెల్లించాలని, 18 సంవత్సరాలు నిండి ప్రతి ఒక్కరు 25 లక్షల రూపాయిలు ఫ్యాకేజి ఇవ్వాలన్నారు. ఇల్లు కోల్పోయిన నిర్వాసితులకు బోదుగల్లం గ్రామాల్లో ఇల్లు స్థలాలు ఇచ్చారని, నిర్మాణ రంగంలో సామాగ్రి పెరగడంతో ప్రత్యేక ప్యాకేజి ఇవ్వాలని, భూములు కోల్పోయిన వారికి ఆర్ కార్డులో ఇవ్వాలని, కంపెనీలో ఉపాధి అవకాశాలు కల్పించాలని, స్థానికలు ఉద్యోగులు కల్పించాలని, స్కిల్ డవలెప్‌మెంటు సెంటరు ఏర్పాటు చేయాలన్నారు. చందనాడ, డిల్‌ఎంపురం గ్రామాల్లో గుళ్ళ బట్టీల కార్మికులు నష్ట పరిహారం చెల్లించలన్నారు.

యం.అప్పలరాజు, సిపియం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

మెరుగైన ప్యాకేజి ఇవ్వాలి

పాయకరావుపేట నియోజకవర్గంలో ఇటువంటి కంపెనీ రావడం వల్ల ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని, సుమారు 55 వేల మంది ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. భూములు కొల్పోయిన రైతులకు ఫ్యాకేజి ఇవ్వాలన్నారు. సియస్ఆర్ నుండి నిధులు చుట్టు ప్రక్కల ప్రాంతాల అభివృద్ధి చెందేలా కంపెనీ యాజమాన్యం కృషి చేయాలన్నారు.

బోలిశెట్టి గోవిందరావు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో భారీ నష్టం

విశాలాంధ్ర - పాయకరావుపేట : పట్టణంలోని కంటోన్మెంట్ వీధిలో భూపతి చిన్న కు చెందిన ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి భారీ నష్టం జరిగింది. బాధితులు అందించిన వివరాలు ప్రకారం శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లో ఉన్న గృహపకరణాలన్నీ అగ్నికి అహుతయ్యాయి. సమాచారం అందుకున్న తుని అగ్రిమాపక సిబ్బంది అధికారులు మంటలను అదుపు చేసినప్పటికీ అప్పటికే ఇంట్లోని వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. లక్షల్లో ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

తగ్గిన జీఎస్టీ వల్ల మహిళా సాధికారతకు ఎంతో ఉపయోగం



విశాలాంధ్ర - యస్.రాయవరం : కేంద్ర ప్రభుత్వం ఇటీవల సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ వల్ల మహిళలకు ఎంతో ఉపయోగమని జిల్లా గ్రామీణ అభివృద్ధి ప్రాజెక్ట్ డైరెక్టర్ సచిదేవి అన్నారు. శనివారం మండల కేంద్రం యస్ .రాయవరం లో మండల వెలుగు ఆధ్వర్యంలో మహిళలు ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. దగ్గరలో ఉన్న కిరాణాదుకాణం వద్దు కు వెళ్లి కొత్త జీఎస్టి ప్రకారం వస్తువులు అమ్మకాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి మనోరమ, తహసీల్దార్ జె. రమేష్ బాబు, డిప్యూటీ ఎంపీడీవో బంగారు సత్యనారాయణ, ఎపిఎం శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు పాల్గొన్నారు.

రోలుగుంటలో స్వచ్ఛత హీ సేవ

విశాలాంధ్ర - రోలుగుంట : రోలుగుంట గ్రామపంచాయతీ పరిధిలో శనివారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రధాన రహదారి వద్ద డీఎల్‌డీఓ, మండల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, ఎంపీడీవో నాగేశ్వరరావు శ్రమదానం చేసి ప్రజలకు, వ్యాపారులకు చెత్త విధానం, పునర్వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు కూడా చురుకైన పాల్గొనటంతో రహదారి పరిసరాలు శుభ్రంగా మారాయి. అనంతరం ఎస్‌డబ్ల్యూసీ షెడ్‌ను పరిశీలించి, మరింత సమర్థవంతంగా నిర్వహించాలనే సూచనలు గ్రామ కార్యదర్శికి ఇచ్చారు. జీఎస్‌డబ్ల్యూఎస్, అంగన్వాడీ, వెలుగు సిబ్బంది, ఆశ కార్యకర్తలు చురుకుగా పాల్గొన్నారు.

అద్వాన్న రహదారులపై అధికారులు, పాలకుల బాధ్యతారాహిత్యం

- రోడ్లు భవనాల శాఖ చీఫ్ సెక్రటరీకు నోటీసులు జారీ చేసిన కోర్టు
- ప్రాణాలను బలిగొంటున్న పాలకులు, అధికారుల అలసత్వం

విశాలాంధ్ర - చోడవరం : చోడవరం - నర్సీపట్నం బి.ఎన్. ప్రధాన రహదారి విషయం పై శనివారం అధికారులు ఇచ్చిన వాంగ్మూలంతో 9వ ఆదనపు జిల్లా కోర్టు అధికారులు నిర్లక్ష్య వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏపీ రోడ్లు భవనాలు శాఖ చీఫ్ సెక్రెటరీ కు కోర్టు నోటీసులు జారీ చేస్తూ ఈ కేసును నవంబర్ 15కు వాయిదా వేసింది. ఆర్క్ ఫోరం ఫర్ బెటర్ చోడవరం, మండల వికలాంగుల సంక్షేమం సంఘం, న్యాయ వాదులు ఆధ్వర్యం లో చేస్తున్న న్యాయపోరాటం అందరికీ తెలిసిన విషయమే. అధికారులు, పాలకులు కాంట్రాక్టర్ అలసత్వం నిర్లక్ష్యం వెరశి విజయరామరాజు పేట కాజ్ వద్ద 8 వ తరగతి చదువు తున్న అదారి రోహిత్ (13), వద్దాది గ్రామానికి చెందిన సుబ్బారావు ఆ చేరు నదులు కొట్టుకుపోయి దుర్మరణం పాలయ్యారు. ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎం ఎస్ రాజుతో సహా ప్రతి వ్యక్తి గుండెని కలిచివేసింది, కంట తడిపెట్టించింది. ఈ నేపద్యంలో చోడవరం ఎంఎల్ఏ అధ్వాన్న రోడ్లు విషయమై అసెంబ్లీ లో ప్రస్తావించడం, జన సేన నాయకులు నియోజక వర్గం ఇన్చార్జి పీవీఎస్ఎన్ రాజు మరణించిన బాధిత కుటుంబాలని పరామర్శించడం వారి ప్రతి ప్రయత్నం ఉద్యమానికి ఉతం ఇస్తుంది అనడం లో సందేహం లేదు. ఈ పరిస్థితుల్లో చోడవరం జిల్లా కోర్టు లో అధికారులు శనివారం హాజరవడం జరిగింది. ఎప్పటిలానే వర్షాలు వల్ల వెయ్యలేక పోయాము నెలరోజుల్లో డబుల్ రోడ్డు నిర్మాణమే నేరుగా ప్రారంభిచేస్తాం అని అధికారులు చెప్పడంతో ఒకింత అసహనం., ఆవేశం..ఆవేదన చోటుచేసుకున్నాయి. అధికారుల, కాంట్రాక్టర్ నిర్వాక పాలకుల భాధ్యత రాహిత్యంతో అద్వాన్న రోడ్లు నిర్మాణంలో అధికారుల వాంగ్మూలంతో 9వ అదనపు జిల్లా జడ్జి సీరియస్ నెస్ తో ఏ.పి. రోడ్లు భవనాలు శాఖ చీఫ్ సెక్రటరీని కూడా ప్రతివాదులుగా చేర్చి నోటీసులు ఇవ్వడానికి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. లక్షల మంది తరపున బాధిత కుటుంబాల తరపున, నష్టపోయిన వ్యా పారులు, వాహన దారులు తరపున, విద్యార్థులు ఉద్యోగులు ఉపాధ్యాయులు తదితరులు తరపున కోర్టు తీర్పుకు ప్రజా సంఘాలు తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కేసును హై కోర్టు లో కూడా వేయడానికి ప్రజా సంఘాలు ముందుకు వచ్చాయిని, కాజ్ వే నిర్మాణం లేకపోవడం వల్ల చనిపోయిన బాధిత వ్యక్తుల కుటుంబాల తరపున మరో ప్రి లిటిగేషన్ కేసు ప్రజాసంఘాలు వెయ్యదానికి ముందుకు వచ్చాయిని వారు తెలియజేశారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యం పక్కాగా చేపట్టాలి : డుమా పీడీ పూర్ణిమదేవి

విశాలాంధ్ర - కె.కోటపాడు : ఇటీవల విస్తృతంగా వర్షాలు కురుస్తున్న కారణంగా గ్రామాల్లో పారిశుధ్యం పై ప్రత్యేక చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి, డుమా పీడీ పూర్ణిమాదేవి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం ఈ మండలం సూరెడ్డి పాలెంలో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్నారు. వీధికొలాయిలు, మంచి నీటి బోర్ల వద్ద మురుగునీరు నిలవ లేకుండా చూడాలన్నారు. ప్రతిరోజు వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టాలన్నారు. ఎక్కడా డయేరియా రాకుండా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కాలువల్లో పూడికలు ఎప్పటికప్పుడు తొలగించి మురుగునీరు సుజావుగా పారేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. వీధుల్లో ఉన్న చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలని అన్నారు. వీధుల్లో ఉన్న చెత్తను అధికారులతో కలిసి తొలగించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జిఎస్టి పై ప్రజలకు అవగాహన కలిగించారు. గ్రామంలో ఉన్న నిత్యావసర దుకాణాల వద్దకు వెళ్లి జిఎస్టి రేట్లు అమలు చేయాలని కోరారు. 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ 'కరపత్రాలను పంపిణీ చేశారు. జీఎస్టీ రేట్లు తగ్గించడం వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలు వివరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు తాసిల్దార్ భుజంగరావు గ్రామ కార్యదర్శిలు విఆర్వోలు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎముకుల పరీక్ష



విశాలాంధ్ర - నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీ గల శ్రీ వెంకటేశ్వర హాస్పిటల్‌లో లయన్స్ క్లబ్ నవ్య ఆధ్వర్యంలో (ఎముకల పట్టుత్వ) పరీక్ష బీఎండి. పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ వైద్యులు డాక్టర్ అధికారి గోపాల్ రావు ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలం లో సరైన ఆహారం పదార్థాలు తీసుకోకపోవడం వలన మన ఆరోగ్యం బలహీన పడుతుందని ముఖ్యంగా ఎముకల బలహీన పడుట వలన త్వరగా విరిగి పోవుటకు అవకాశం ఉందని ఈ పరీక్ష వలన ఎముకలు యొక్క పటుత్వాన్ని తెలుసుకోవడం ద్వారా ముందుగా మేల్కొని ఆరోగ్య కరమైన ఆహారం తీసుకోవడం ద్వారా ముఖ్యంగా నువ్వులు , పాలకూర, పాలు ,గుడ్లు కాల్షియం ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవడం ద్వారా ఈ యొక్క సమస్యలను నివారించవచ్చు అని ఆయన తెలియజేశారు. ఇటువంటి ఉచిత హెల్త్ క్యాంపులు నిర్వహించినా లయన్స్ క్లబ్ నవ్య వారిని ఆయన అభినందించారు. క్లబ్ ప్రెసిడెంట్ కర్రీ రామ్ గోపాల్, సెక్రెటరీ విజయకుమార్ ట్రెజరర్ నక్క.సుధీర్ బాబు క్లబ్ సీనియర్ సభ్యులు వెలగ నారాయణరావు, వికాస్ సతీష్, గొలుసు శ్రీనివాసరావు, కాకర్ల శివ సత్యనారాయణ, సీరం. కిరణ్ కుమార్, కట్టమూరి నరేష్, ఎండిపి సతీష్ పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ 2025 అభ్యర్థుల ఫిర్యాదులు, అభ్యంతరాలు కొరకు 25 అక్టోబర్ వరకు అవకాశం

విశాలాంధ్ర - అనకాపల్లి : ప్రభుత్వం ఈనెల 15న తుది ఎంపిక జాబితాలను విడుదల చేసి. మెగా డి.ఎస్.సి- 2025 అధికారిక వెటసైట్లో ఉంచడం జరిగిందని ఆ ఎంపిక జాబితా పై అభ్యర్థులకు ఎటువంటి ఫిర్యాధులు , అభ్యంతరాలు ఉన్న, వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం జిల్లా స్థాయి పోస్టుల ఎంపికకు సంబంధించి సంబంధిత జోనల్ ఆర్జేడీ ఆ జోన్లోని ఇద్దరు జిల్లా విద్యా అధికారులు (డిఇఓ)తో కూడిన జోనల్ కమిటీ, జోన్, రాష్ట్ర స్థాయి పోస్టులకు సంబంధించి ముగ్గురు రాష్ట్ర స్థాయి అధికారులతో రాష్ట్ర స్థాయి గ్రీవెన్స్ రీడ్రెసల్ కమిటీలు (అభ్యంతర పరిష్కార కమిటీలు) ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జోనల్ స్థాయి , రాష్ట్ర స్థాయి కమిటీలు 15 రోజులలో తమకు అందిన ఫిర్యాధులు, అభ్యంతరాలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు జోనల్ కమిటీ నిర్ణయంపై సంతృప్తి చెందనట్లయితే, రాష్ట్ర స్థాయి కమిటీకి అప్పీల్ చేసుకోవచ్చు. కావున అభ్యర్థులు తమ అభ్యంతరాలను సమర్పించేందుకు సంబందిత జోన్ కమిటీ లేదా రాష్ట్ర స్థాయి కమిటీని సంప్రదించవచ్చు అని తెలిపారు. ఒక వేల రాష్ట్ర స్థాయి కమిటీ తీర్పు పై కూడా అభ్యర్థి సంతృప్తి చెందినట్లైయితే, తుది అప్పీల్ కోసం ఫైనల్ అప్పీలేట్ అథారిటీ (పాఠశాల విద్యా సంచాలకులు) వద్ద ఆర్జీ చేసుకోవచ్చు. ఆ ఫిర్యాధులను, అభ్యంతరాలను 30 రోజుల్లో పరిష్కరించడం జరుగుతుంది. ఫైనల్ అప్పీలేట్ అథారిటీ నిర్ణయం చివరి నిర్ణయంగా పరిగణించబడుతుంది అని అన్నారు. మెగా డి.ఎస్.సి- 2025 అభ్యర్థులు తమ ఎంపికకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు,అభ్యంతరాలు ఉన్నట్లైతే 25 అక్టోబర్, 2025లోపు సంబంధిత జోన్, రాష్ట్ర స్థాయి గ్రీవెన్స్ రీడ్రెసల్ కమిటీలుకు సంప్రదించవచ్చు. 25 అక్టోబర్, 2025 లోపు వచ్చిన ఫిర్యాదులను, అభ్యంతరాలను మాత్రమే పరిగణలోకి తీసుకోవటం జరుగు తుంది. ఆ తరువాత వచ్చిన పిర్యాదులను, అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొనబడవు. అభ్యర్థులు తమ ఫిర్యాదులు, అభ్యంతరాల ప్రింటెడ్ హార్డ్ కాపీను సంబంధిత కమిటీకి పంపించాలి అదే ఫిర్యాధులు ఈ- మెయిల్ ద్వారా సంబంధిత కమిటీకి పంపించ వలసి ఉంటుంది అని అన్నారు. ఈ క్రింది ఇచ్చిన ఈమెయిల్స్ ద్వారా అభ్యర్థులు తమ అభ్యంతరాలను, ఫిర్యాదులను చేయవచ్చు అన్నారు.

జోన్‌బి 1 : mdscgrievances.z1@apschooledu.in
జోన్-2 : mdscgrievances.z2@apschooledu.in
జోన్-3 : mdscgrievances.23@apschooledu.in
జోన్-4 : mdscgrievances.24@apschooledu.in
రాష్ట్ర స్థాయి ఫిర్యాదుల పరిష్కార కమిటీ :
mdscgreivances.state@apschooledu.in
తుది అప్పీల్ కోసం : mdscappellateauthority@apschooledu.in

పాడిరైతులకు అండగా హెరిటేజ్ డెయిరీ

విశాలాంధ్ర - అచ్యుతాపురం : పాడిరైతులకు హెరిటేజ్ డెయిరీ అండగా ఉంటుందని డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు . శనివారం మండలంలో రామన్నపాలెం గ్రామంలో హెరిటేజ్ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్నా పాడిరైతు గత మే నెలలో ధర్మిరెడ్డి శ్రీనివాసరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మృతుని భార్య ధర్మిరెడ్డి నూకరత్నంనకు మేనేజర్ కూండ్రపు శేషు రెండు లక్షల రూపాయలు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడిరైతులకు జిల్లాలో అన్ని డెయిరీల కంటే పాలుకు అధిక ధర చెల్లిస్తూ, ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు . పాడిరైతు పశువులకు కృత్రిమ గర్భధారణ రాయితీపైరూ. 50, కృత్రిమ గర్భధారణ (ఆడ దూడ జన్మించుటకు) రాయితీపై రూ. 500 లకు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.కిషోర్, డి అప్పలనాయుడు , డి.రాము, ఆర్ చిన్నరాము , డి రాము, పి నర్సింగరావు , ఆర్ రామనాయుడు తదితర పాడిరైతులు పాల్గొన్నారు.

వైసీపీ శ్రేణులు డిజిటల్ బుక్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షులు అమర్

విశాలాంధ్ర - అనకాపల్లి : కూటమి ప్రభుత్వం 16 నెలలుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయ కులు, కార్యకర్తలు టార్గెట్గా హింసలకు పాల్పడుతూ, అక్రమ కేసులు బనాయిస్తూ, కొంతమంది కార్య కర్తలను బలి తీసుకున్న సంఘటనల నేపథ్యంలో కార్యకర్తల బాధలను, వారి పడుతున్న వారి ఇబ్బం దులను ఎప్పటికప్పుడు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి డిజిల్ బుక్‌లో నమోదు చేసుకోవాలని మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్ కోరారు. జిల్లా కేంద్రంలో గల పార్టీ కార్యాలయంలో శనివారం డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కూటమి ప్రభుత్వ అరాచకాలకు ఈ 16 నెలల కాలంలో 300 మంది మృతి చెందగా 2700 మందిపై అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి కేంద్ర కార్యాలయం ఇటీవలే ఈ బుక్‌ను విడుదల చేయగా జిల్లా కేంద్రంలో ఈరోజు, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో క్యూఆర్ కోడ్ విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కార్యకర్తలు ఎదుర్కొంటున్న అన్ని ఇబ్బందులను క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆ బుక్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇలా ఉండగా అసెంబ్లీలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని ఉద్దేశించి మాట్లాడిన మాటలు చూస్తే సభ్య సమాజం తల దించుకునేలా ఉన్నాయని అన్నారు. అదే సందర్భంలో చిరంజీవిపై కూడా విమర్శలు చేశారని అన్నారు. ఇంత జరుగుతున్న జనసేన కార్యకర్తలు గాని, ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ గాని, ఎమ్మెల్సీ నాగబాబు గానీ స్పందించకపోవడం సిగ్గుచేటు అన్నారు. పవన్ కళ్యాణ్, నాగబాబు తీరుపై జన సైనికులే ఆశ్చర్య వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా వారు స్పందించి చిరంజీవికి మద్దతుగా నిలవాలని కోరారు.

జర్నలిస్ట్ హెల్త్ కార్డు రెన్యువల్‌కు నిధులు మంజూరు

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : జర్నలిస్ట్‌ల హెల్త్ కార్డులు రెన్యువల్‌కు నిధులు మంజూరు జేసినట్లు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న జర్నలిస్టుల ఆరోగ్య పధకం రెన్యువల్ కొరకు మూడు లక్షల ఏభై ఐదు వేల రూపాయలు మంజూరు చేసినట్లు ఆమె తెలిపారు. జిల్లాలో సెప్టెంబర్ 2025 నెలలో రెన్యువల్ చేసుకున్న అక్రిడిటేషన్ స్లిప్ కలిగి ఉన్న జర్నలిస్ట్‌లు జిల్లా సమాచార పౌర సంబందాల అధికారి కార్యాలయంలో వారి వివరాలు అందజేసి హెల్త్ కార్డులు రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు.

జాగృతి సిద్ధిఫల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ 6వ ప్రాతినిధ్య మహాజనసభ

విశాలాంధ్ర - చోడవరం : మండలంలోని లక్ష్మీపురం, అడ్డూరు గ్రామాల్లో సిద్ధిఫల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్, 6 వ సర్వసభ్య మహాజన సభ మరియు జాగృతి సంస్థ మార్గదర్శకులు రైతు కంపెనీల వ్యవస్థాపకులు కీ.శేషులు స్వర్గీయ కందర్ప రామకృష్ణ 60 వ జయంతి వేడుకలను శనివారం సిద్ధి ఫల కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. రైతుల స్ఫూర్తికి నిదర్శనంగా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ప్రాంగణంలో స్వర్గీయ కందర్ప రామకృష్ణ విగ్రహ ఆవిష్కరణ చేసి పూలమాలతో సత్కరించారు. తదుపరి ఆయన సుదీర్ఘ ప్రయాణంలో చేసిన కార్యక్రమాల గురించి సభలో సభ్యులకు తెలియజేశారు. అనంతరం కంపెనీ చైర్మన్ చేతుల మీదుగా ఆరవ వార్షిక నివేదికను ఆవిష్కరించారు. కంపెనీ సీఈఓ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో జరిగిన లావాదేవీలు, వివిధ 5కార్యక్రమాల గురించి సభలో సభ్యులకు వివరించడం జరిగింది, అలాగే రైతుల స్మార్ట్ బిజినెస్ కార్డు (ఆర్.కార్డ్) ను పాలకవర్గ సభ్యులు, అధికారుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆర్.కార్డ్. రైతులకు ఎలా ఆర్థికంగా ఉపయోగపడుతుందో వివరించారు. అధికారులు, పాలకవర్గ ప్రసంగం, సభ్యుల ఎన్నిక ను జరిపారు. స్వర్గీయ కందర్ప రామకృష్ణల్లో మహోన్నత ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామని సభలో సభ్యులందరూ తీర్మానించుకొని, ఆయన 60వ జయంతి వేడుకలు కేక్ కటింగ్ కార్యక్రమంతో ఘనంగా నిర్వహించారు.

కార్పెంటర్స్ మోదకొండమ్మ గుడికి గుమ్మం బహుకరణ

విశాలాంధ్ర - గొలుగొండ : శ్రీ కామాక్షి వీరబ్రహ్మేంద్ర వడ్రంగి పనివాళ్ల సంఘం వాళ్లు పెద మాకవరం గ్రామం, కొయ్యూరు మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా లో ఉన్నటువంటి శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ ఆలయ నిర్మాణంలో భాగంగా గుడి యొక్క "సింహద్వారము ఏ.ఎల్.పురం స్థానిక కార్పెంటర్స్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ధార్మిక సంస్థ సేవా ప్రతినిధి డివిడి ప్రసాద్ కార్పెంటర్ సంఘం గౌరవ అధ్యక్షులు బర్టికల వరప్రసాద్, సంగం ప్రెసిడెంట్ తామరపల్లి శివ, వంగ నాగేశ్వరరావు, కట్టుమల్ల శ్రీను, గొల్తి తాతాజీ సంగం పెద్దలు గ్రామ ప్రజలు పాల్గొని అమ్మవారి కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశారు.. ఆలయ పూర్తి నిర్మాణం కొరకు తమ వంతుగా ధన వస్తువు రూపైన ప్రజలు ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాల్సిందిగా భాగస్వాములు కావల సిందిగా డివిడి ప్రసాద్ పిలుపునిచ్చారు.

కరణం ధర్మశ్రీని కలిసిన వైసీపీ నాయకులు గండి రవికుమార్

విశాలాంధ్ర - సబ్బవరం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ విప్,యల మంచిలి నియోజకవర్గం వైస్సార్సీపీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పిఏసి మెంబెర్‌గా నియమితులైన కరణం ధర్మశ్రీ ని అనకాపల్లి జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు అనకాపల్లి జిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్ సారథ్యంలో పెందుర్తి నియోజకవర్గం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గండి రవికుమార్ కరణం శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాజీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేటి ప్రసాద్‌ని అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త నియమితులైన శుభసంధర్భంగా బొడ్డేటి ప్రసాద్ ని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా గండి రవికుమార్ వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయనతో వైస్సార్సీపీ నాయకులు యద్ల నాయుడు, బత్తిన వెంకట్ ఉన్నారు.

జాగృతి స్వచ్ఛంద సంస్థ అభివృద్ధికి దిశా దశలను నిర్దేశించిన మహా వ్యక్తి స్వర్గీయ కందర్ప రామకృష్ణ

జాగృతి స్వస్థత సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కందర్ప సుజాత

విశాలాంధ్ర - సబ్బవరం : జాగృతి స్వచ్ఛంద సంస్థ అభివృద్ధికి దిశా దశలను నిర్దేశించిన మహా వ్యక్తి స్వర్గీయ కందర్ప రామకృష్ణ అని జాగృతి స్వస్థత సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కందర్ప సుజాత అన్నారు. మండలంలోని స్థానిక జాగృతి కార్యాలయంలో శనివారం స్వర్గీయ కందర్ప రామకృష్ణ 60వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం ఎన్నో సరికొత్త ప్రణాళికలను ఏర్పాటుచేసి వారి అభివృద్ధికి స్వర్గీయ రామకృష్ణ తోడ్పాటు అందించారన్నారు.అలాగే మహిళల కోసం అతి తక్కువ వడ్డీ రుణాలను అందించడమే కాక స్వశక్తితో మహిళ అభివృద్ధి చెందాలని మంచి ఆలోచన చేసే ఆర్గానిక్ వ్యవసాయంతో పాటు కూరగాయలు వ్యాపారాలు కల్పించిన వ్యక్తి అన్నారు. ఆయన ఆశలకు అనుగుణంగా జాగృతి సంస్థను నిర్విరామంగా కొనసాగించేందుకు సాయి శక్తుల పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జాగృతి సంస్థ బోర్డు డైరెక్టర్ రేసుపూడి రమణ, ఆడిటర్ వడ్లమాని సుధాకర్, కె జ్యోతి , అన్ని మండలాల రైతు ఉత్పత్తిదారుల పాలకవర్గ సభ్యులు, రైతులు, మహిళలు, పాల్గొన్నారు.

పాము కాటుకి మహిళ మృతి

విశాలాంధ్ర - యలమంచిలి : ఎలమంచిలి మండలం ఎలమంచిలి రూరల్ ఎస్సై ఉపేంద్ర తెలిపిన వివరాల మేరకు జంపపాలెం గ్రామంలో శనివారం మధ్యాహ్నం 12.15 గంటల సమయంలో జంపపాలెం గ్రామం సమీపం నందు పంట పొలంలో పనిచేసు కుంటున్న జంపపాలెం గ్రామానికి చెందిన సిలవరశెట్టి రమణమ్మ వైఫ్/ఆఫ్ సత్యనారాయణ, 51 సంవత్సరాల, గవర కులం, ఆమె పాము కాటుకు గురి కాగా, ఆమెను వారి బంధువులు ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినప్పటికీ ఆమె చనిపోయినట్లు, వైద్యులు నిర్ణయించగా ఆమె కుమారుడైన శిల్పరశెట్టి స్వామి పూర్ణచంద్రారావు పోలీస్ వారికి ఇచ్చిన ఫిర్యాదు మేరకు యస్సై కేసు నమోదు పరిచి దర్యాప్తు చేస్తున్నారు. యలమంచిలి రూరల్ ఎస్సై ఉపేంద్ర తెలిపారు.

వికసిత్ భారత్ క్విజ్ పోటీలకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్ : వికసిత్ భారత్ క్విజ్ పోటీలకు యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విజ్ సీఈవో బి.వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. జనవరిలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవం ఏటా నిర్వహించడం అనవాయితీ. అందులో భాగంగా వికసిత్ భారత్ యంగ్ లీడర్ పేరుతో క్విజ్ కార్యక్రమం తలపెట్టినట్లు చెప్పారు. ఆసక్తి గల వాళ్లు అక్టోబర్ 15వ తేదీలోగా mybharat.gov.in వెబ్ సైటులో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. 15-29 ఏళ్ల మధ్య యువత అర్హులని, ఉమ్మడి జిల్లాల యువకులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

కోనవానిపాలెంలో దుర్గాదేవి దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

విశాలాంధ్ర -యస్.రాయవరం : మండలంలో తిమ్మాపురం గ్రామ పంచాయతీ శివారు కోనవానిపాలెం గ్రామంలో కనక దుర్గాదేవిని పాయక రావుపేట వైసిపి ఇన్ చార్జ్ మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు దర్శించుకున్నారు. శ్రీ కనకదుర్గ యాదవ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న నవరాత్రుల్లో భాగంగా అమ్మవారి మండపం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు దీంతో భక్తులు అన్న ప్రసాదాలను స్వీకరించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జోగులు అమ్మవారిని దర్శించుకోవడంతో పాటు అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, వైసిపి సీనియర్ నాయకులు మధువర్మ, సింహాద్రి యాదవ్ శ్రీ కనకదుర్గ యాదవ్, యువజన సేవా సంఘం అధ్యక్షుడు కొర్ని బాబ్జి, నూకరాజు, సూరిబాబు, రమణ ,రాజేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలిలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ్ ఆంధ్ర

విశాలాంధ్ర - యలమంచిలి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛ్ ఆంధ్ర, స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా చైర్పర్సన్ పిల్లా రమా కుమారి, మున్సిపల్ కమిషనర్ బిజెఎస్ వి.రాజు, స్పెషల్ ఆఫీసర్ కె. సత్యనారాయణ వారి సమక్షంలో యలమంచిలి పురపాలక సంఘ పరిధిలో ప్రతి శనివారం ఒక గంటపాటు స్వచ్ఛత, శ్రమదాన కార్యక్రమంలో భాగంగా శనివారం నాడు స్థానిక సన్యాసమ్మ చెరువు వద్ద శ్రమదానం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగా సన్యాసమ్మ పార్కులో కొంతమేర తుప్పలు, చెత్తను తొలగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, శానిటరీ ఇన్స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, మున్సిపల్ ఏ.ఈ గణపతి, సచివాలయ సిబ్బంది, మునిసిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సూర్య ఆదిత్య ట్రేడ్ ఫర్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రేత్యేక ఆకర్షణగా హిమాలయాలు, జలకన్య సెట్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : విజయనగరం లోని బాలాజీ జంక్షన్ మాన్సాస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సూర్య ఆదిత్య ట్రేడ్ ఫర్ ఎగ్జిబిషన్‌ని తెలుగు దేశం నాయకులు శనివారం సాయింత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ మొత్తం తిరిగి పరిశీలించారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి ఐ.వి.పి. రాజు మాట్లాడుతూ విజయనగరం పైడితల్లమ్మ ఉత్సవాల సందర్భంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం ఆనందదాయకం అని తెలిపారు. వినూత్నంగా ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్ ని ప్రజలందరూ వీక్షించాలని ఆకాంక్షించారు. ఎగ్జిబిషన్ ని ఏర్పాటు చేసిన నిర్వాహకులకు మంచిగా వ్యాపారం జరగాలి అని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎగ్జిబిషన్ నిర్వహకులు శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా వినూత్నమైన కాశ్మీర్ అందాలను చూపిస్తూ దాంతోపాటు ప్రత్యేక ఆకర్షణగా జలకన్య ఏర్పాటు చేయడం జరిగింది. అంతేకాకుండా చిన్న పిల్లల నుండి పెద్దలు వరకు అనేక రకాల గేమ్స్, షాపింగ్, పలు రకాల రైడ్స్ ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. ప్రజలందరూ ఎగ్జిబిషన్ తిలకించి ఆనందిస్తారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కే. వెంకట నర్సింగారావు, బొద్దాల నర్సింగారావు, ప్రసాదుల ప్రసాద్, కనకల మురళి మోహన్, అనురాధ బేగం, నాయుడు, డి.శ్రీనివాస్, జి.శేఖర్ రెడ్డి,వి. భద్రరావు, ఎస్. స్వామి, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారా వాలీబాల్ క్రీడాకారుడుకి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - యస్.రాయవరం : ప్రపంచ పారా వాలీబాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారుడికి శ్రీ ప్రజ్ఞ జూనియర్ కాలేజ్ ఆర్థిక సహాయం అందించింది .శ్రీ ప్రజ్ఞ జూనియర్ కాలేజీలో 2016-18 సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదివిన సోముదేవుపల్లి గ్రామానికి చెందిన అన్నం గణేష్ కు ప్రపంచ స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక అవడంతో కాలేజీ యాజమాన్యం ఆ క్రీడాకాడికి తన వంతు సహాయంగా పదివేల రూపాయలను ప్రిన్సిపాల్ రాపార్తి రాము చేతుల మీదుగా అందజేశారు. అదే విధంగా కళాశాల సిబ్బంది ఆ క్రీడాకారున్ని ఘనంగా సత్కరించారు. అక్టోబర్ నెలలో జరిగే అంతర్జాతీయ పోటీల్లో మంచి స్థానం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది జోగినాదం, రమేష్ ,ప్రకాష్, రాజు, కుమార్, రాము, అలేఖ్య శ్రావణి పాల్గొన్నారు.

అన్న సమారాధనకు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - అనకాపల్లి : ప్రముఖ వ్యాపారవేత్త, సంఘ సేవకులు ముత్యాల వెంకటేశ్వర రావు తనయుడు ముత్యాల రాజేష్ అన్న సమారాధనకు 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని శనివారం తమ కార్యాలయంలో అందజేశారు. శ్రీ శక్తి పీఠం వారికి అనసమరాధన కార్యక్రమానికి సహాయం చేసినందుకు తెలిపారు. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమంలో భాగంగానే ఈ సహాయం చేసినట్లు రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గా సాయి గణపతి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లలిత త్రిపుర సుందరి దేవిగా కనకదుర్గమ్మ

విశాలాంధ్ర - చోడవరం : చోడవరం పాత బస్టాండ్ లో మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వేంచేసిన శ్రీ కనకదుర్గాదేవి ఆలయంలో దసరా నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఆరవ రోజైన శనివారం శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. దుర్గా అమ్మవారిని వివిధ రకాల కాయగూరలతో శాకంబరి (లలిత)గా అలంకరణ చేసి, వేకువజాము నుండి శ్రీ సూక్త సహిత సహస్ర కుంకుమార్చన, పంచామృత అభిషేకములు, హోమం నిర్వహించినట్లు ఆలయ అర్చకులు శివకుమార్ శర్మ తెలియజేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు మోటార్ వర్కర్స్ యూనియన్ ఉత్సవ కమిటీ తెలిపారు. మండలంలో దామునాపల్లి, మైచర్లపాలెం, లక్ష్మీపురం, వెంకన్నపాలెం తదితర గ్రామాల్లో దుర్గా శరన్నవరాత్రుల్లో నిత్యం శ్రీ సూక్త విధానంలో భవాని భక్తులచే సామూహిక కుంకుమ పూజలు, నిత్య అన్నదానం నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ బలిరెడ్డి వసుంధర నాగేశ్వరరావు తెలిపారు.

పశు వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి

జిల్లా పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డా.ఎం. చంద్రశేఖర్

విశాలాంధ్ర - సబ్బవరం : పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని విశాఖపట్నం డివిజన్ పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని మొగలిపురం, సబ్బవరం పంచాయతీ గోపాల్ నగర్ గ్రామాలలో శనివారం నిర్వహించిన ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు 3 నెలలు నిండిన ప్రతి పాడిపశువుకి తప్పనిసరిగా వేయించాలని, ఈకార్యక్రమం అక్టోబర్ 15 వరకు కొనసాగుతుందని తెలియజేసారు..అనంతరం గొట్టివాడ, గ్రామీణ పశువైద్య కేంద్రం లో ఆయన సంపూర్ణ తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సబ్బవరం ఏరియా వశువైద్య శాల, సహాయ సంచాలకులు డా.కె.ఉషాకుమారి, ఏహెచ్ఏ త్రినాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్ కార్యనిర్వాహణాధికారిని కలిసిన చైర్మన్ బలిజి మహారాజ్

విశాలాంధ్ర - రోలుగుంట : రోలుగుంట మండలం జానకిరాంపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ బలిజి మహారాజ్ శనివారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రధాన కార్యనిర్వాహక అధికారి డివిఎస్ వర్మను కలిశారు. ఈ సమావేశంలో సంఘ ఆర్థిక పరిస్థితులు, రైతుల సమస్యలు, పంచాయతీ రైతులకు సంబంధించిన అంశాలు వివరించబడ్డాయి. చైర్మన్ మహారాజ్ ప్రత్యేక దృష్టి పెట్టి రైతులకు ఆర్థిక భరోసా, సహాయం అందించమని కోరారు. ఈ సమావేశంలో సీఈఓ డివిఎస్ వర్మ సానుకూలంగా స్పందించి, అవసరమైతే సహకార సంఘ సభ్యులకు ఆర్థిక వనరులు అందిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో సంఘ, రైతుల సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.